ఏడొంపుల గెడ్డను ఊడ్చేస్తున్నారు..!

- ఏడొంపుల గెడ్డలో ఇష్టారీతిగా ఇసుక తవ్వకాలు
- రోజుకు 150కు పైగా ట్రాక్టర్ లోడ్‌ల ఇసుక తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



గెడ్డ నుంచి ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లు



ఏడొంపుల గెడ్డలో ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్

గజపతినగరం రూరల్: అధికార పార్టీ నేతల అండ దండలతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఉచిత ఇసుక పాలసీ కూటమి నేతలకు వరంగా మారింది. వాగులు, వంక ల్లో ఎక్కడైనా, ఎవరైనా తమ సొంత అవసరాల కోసం ఇసుకను తవ్వుకుని ఉచితంగా తీసుకువెళ్లవచ్చని, ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లతో రవాణా చేసుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడంతో ఇదే అదునుగా భావించిన ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. గెడ్డలు, వాగులు, నదులను ఊడ్చేస్తున్నారు. అడిగే వారు లేరనే ధీమాతో పగ లు, రాత్రి అని తేడా లేకుండా యథేచ్ఛగా, ఇష్టారీతిగా ఇసుకను తవ్వుకుని విక్రయించుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. గజపతినగరం మండలంలోని చంపావతి నది తో పాటు ఎం.గుమడాం గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఏడొంపులగెడ్డలో ఇసుక తవ్వకాలు నిత్యకృత్యమయ్యాయి. ఏడొంపుల గెడ్డలో చేపడుతున్న ఇసుక తవ్వకాల వల్ల ఆగెడ్డ సహజ స్వరూపం కోల్పోతోంది. గెడ్డలో రాళ్లు తేలుతున్నాయంటే ఇక్కడ ఏ స్థాయిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇసుకాసురులు ఈ గెడ్డ నుంచి రోజూ 25 ట్రాక్టర్లతో 150కు పైగా లోడ్‌ల ఇసుక తరలించేస్తున్నారు. చంపావతి నదిలో పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. దీంతో చంపావతిలో, ఏడొంపుల గెడ్డలో ఉన్న తాగునీటి పథకాలు, చుట్టు పక్క గ్రామాల్లో తాగు, సాగునీటి బోర్లు ఎండిపోతున్నాయని వాటి సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

అభివృద్ధి పనుల పేరుతో...

ఇళ్ల నిర్మాణాలు, గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసమని చెప్పుకుంటూ ఎవరికి ఎంత నచ్చితే అంత ఇసుక తవ్వేస్తు న్నారు. ట్రాక్టర్ల యజమానులు కూలీలను పెట్టుకుని ఇసుకను నగరాల్లోని అపార్ట్‌మెంట్లకు, పరిశ్రమలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. కొందరు ఇసుకను ఓచోట డంపింగ్ చేసి అక్కడి నుంచి విక్రయాలు చేస్తున్నారు. చంపావతి నది, ఏడొంపుల గెడ్డకు దగ్గరలో ఉన్న ప్రాంతాల వారికి ట్రాక్టర్ ఇసుక రూ. 2 వేలకు, మండ ల కేంద్రం దాటితే రూ.3 వేల నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు.

ఎవరికీ చెప్పలేకపోతున్నాం..



ఉచిత ఇసుక విధానం తీసుకు వచ్చిన తర్వాత ఎవరికీ చెప్పలేకపోతున్నాం. సొంత అవసరాలు, గ్రామాభి వృద్ధి పనులకు అని చెప్పి ట్రాక్టర్లతో ఇసుకు తీసుకు వెళుతున్నారు. ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించకుండా దృష్టి సారిస్తాం.

– ఎస్. రత్నకుమార్, తహసీల్దార్,గజపతినగరం

ఇసుక రీచ్ లేదు

ఎం.గుమడాం గ్రామంలో ఇసుక రీచ్ లేదు. ఇసుక తరలింపుపై ప్రత్యేక నిబంధనలు ఏమీ లేకపోవడం వల్ల మేము అడ్డుకోలేకపోతున్నాం. అక్రమంగా ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తున్న వారిని సంబంధిత శాఖ అధికారులు పట్టుకుని మాకు అప్పగిస్తే చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మణరావు, ఎస్ఐ, గజపతినగరం

క్లుప్తంగా

భర్తాపురంలో హోమియో వైద్యశిబిరం



శిబిరానికి వచ్చిన వారికి భోజనాలు అందిస్తున్న నిర్వాహకులు

శృంగవరపుకోట: భర్తాపురం గ్రామంలోని శ్రీకల్యాణ ప్రసన్న వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద విశ్వమానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో పాత రిజిస్ట్రేషన్లు ఉన్న 67 మంది రోగులకు, కొత్తగా నమోదు చేసుకున్న 34 మందికి వైద్యపరీక్షలు చేశారు. ఆల్కహాల్ అడిక్షన్ ఉన్న 9 మందికి వైద్య సేవలందించారు. అలాగే ఆరు పశువులకు లంపీ వాక్సిన్ వేశారు. శిబిరా నికి హాజరైన రోగులు, వైద్యులు, ఆస్పత్రుల వైద్య సిబ్బందికి నిర్వాహకులు భోజనాలు ఏర్పాటు చేశారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



సీతారాములను దర్శించుకుంటున్న మంత్రి శ్రీనివాస్

దత్తిరాజేరు: మండలంలోని దత్తివెంకటాపురంలో మూడురోజులగా నిర్వహిస్తున్న రామాలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మూడోరోజు సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. సీతారాములను రాష్ట్ర ఎంఎస్ఎంఈ,సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దర్శించుకున్నారు. మంత్రికి వేద పండితులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు బోడసింగి సత్తిబాబు ఉన్నారు.

12న 'యువత పోరు'

- నేడు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కొత్తవలస: విద్యార్థులు, నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, వారి తరపున వైఎస్సా ర్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల12వ తేదీన 'యువత పోరు' పేరిట కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కడు బండి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'యువత పోరు' కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కొత్తవలస మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో క్యాంపు ఆఫీస్‌లో సోమవారం ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. వాల్ పోస్టర్ల ఆవిష్కరణకు ఎస్.కోట నియోజకవర్గంలోని అయిదు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

గజపతినగరంలో..

గజపతినగరం: 'యువత పోరు' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆవిష్కరిస్తారని జెడ్పీటీసీ గార తవుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

ఆ మందిరం.. నిత్యాన్నదాన ప్రాంగణం..

- ఆకలి తీర్చే సాయినాథుడికి నిత్య పూజలు
- 365 రోజులూ అన్నదానంతో కడుపు నింపుకుంటున్న అభాగ్యులు



శ్రీ షిరిడి సాయిబాబా మందిరం

విజయనగరం గంటస్తంభం: నగరంలోని రింగ్‌రోడ్డు సింహాద్రినగర్‌లో గల షిర్డీ సాయిబాబా మందిరం ఎంతోమంది అన్నార్తుల ఆకలి తీరుస్తోంది. సువిశాలమైన ప్రాంగణం, ప్రశాంత వాతావరణం ఆ మందిరం సొంతం. మనసుకు ప్రశాంతత చేకూర్చే జ్ఞానమందిరంతో పాటు సుమారు 200 మంది ఒకేసారి భోజనం చేయడానికి అనువైన సత్రం ఇక్కడ ఉండడంతో నిత్యం భక్తులతో ఈ ఆలయం కళకళలాడుతోంది.

ఏడాది పొడవునా..

రోజూ మధ్యాహ్నం బాబా హారతి అయిన తర్వాతత ఇక్కడ అన్నదానం ప్రారంభమవుతుంది. ఈ ఆలయం మీదుగా వెళ్లిన వారరు ఆకలితో వెళ్లకూడదనే ఉద్దేశంతో కమిటీ సభ్యులు ప్రతి రోజూ అన్నదానం చేపడుతున్నారు. పిల్లలు, వీధి వ్యాపారులు, భిక్షాటకులు నిత్యం ఇక్కడ భోజనాలు చేసి వెళ్తుంటారు. ఇక ప్రత్యేకమైన రోజులలో అయితే మరి చెప్పనవరం లేదు. శ్రీరామనవమి, విజయదశమి, దత్తాత్రేయ జయంతి, గురుపూర్ణిమ వంటి రోజులలో వేలాది మందికి అన్నదానం జరుగుతుంది.

మెడికల్ క్యాంప్‌ల ఏర్పాటు..

ప్రతి గురువారం మందిరంలో ప్రత్యేక భజనలు, పూజలు చేస్తుంటారు. ఈ సమయంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటారు. అలాగే చిన్న చిన్న వ్యాపారులను ప్రోత్సహించేందుకు ఉచితంగా స్టాల్స్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తుంది ఈ ఆలయ కమిటీ.

ఉన్నత చదువులకు పదోతరగతి తొలిమెట్టు



ఫేర్‌వెల్‌డే సందర్భంగా గురుకుల పాఠశాల ముఖద్వారం వద్ద విద్యార్థినులు వేసిన ముగ్గు



పదోతరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న జూ క్యూరేటర్ మంగమ్మ

కొత్తవలస: ఉన్నత చదువులకు పదోతరగతి తొలి మెట్టు లాంటిందని, విద్యార్థులు ఇక్కడ సాధించిన ఫలితాలపై వారి భవిష్యత్ ఆధారపడి ఉంటుందని విశాఖపట్నం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ జి.మంగమ్మ అన్నారు. జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థినుల వీడ్కోలు కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన మంగమ్మ మాట్లాడుతూ చదువు ఒక్కటే జీవితాలను మార్చగలదన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులు నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్ విజయకుమార్‌పాత్రో, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

బొండపల్లి: గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈనెల 12వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్న ట్లు ఆ పార్టీ బొండపల్లి మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వేడుకల అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'యువత పోరు' ధర్నా కార్యక్రమానికి తరలి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల హౌస్ అరెస్టు



కొత్తవలస మండల అంగన్‌వాడీ కార్యకర్తల అధ్యక్షురాలు తులసిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

కొత్తవలస: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో సోమవారం ధర్నా నిర్వహించేందుకు సీఐటీయూ పిలుపునిచ్చింది. ఈ ధర్నాకు మండలం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు తరలివెళ్లకుండా పలువురిని పోలీస్‌లు ఆదివారం హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ తీరును సీఐటీయూ నాయకుడు గాడి అప్పారావు ఖండించారు. తాము అధికారంలోకి వస్తే ముందస్తు ఆరెస్టులు ఉండవని ఎన్నికల సమయంలో లోకేష్, పవన్‌కల్యాణ్ చెప్పారని, మరి ఇప్పుడు వారు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ పాలన దారుణంగా ఉందని, ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడుతున్నాయని హెచ్చరించారు.అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



రామాలయం వద్ద భక్తులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసలో రామాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసం దర్భంగా గ్రామస్తులు సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సీతా రాములను దర్శించుకున్నారు. జెడ్పీ చైర్మన్‌కు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం



విశ్రాంత అధ్యాపకుడు సాసుబిల్లి హరశ్రీరాములను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మెరకముడిదాం: గర్భాం గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మెరకముడిదాం, చీపురుపల్లి మండలాల విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశాన్ని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొట్నూరు సత్యం, అంపోలు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి సభ్యులు అంతా కృషిచేయాలని పిలుపునిచ్చారు. సంఘం ప్రధాన కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్లు తయారు చేయిస్తున్నామని చెప్పారు. ఎవరైనా సభ్యులు కార్యాలయానికి రాలేకపోతే వారి ఇళ్లకు వెళ్లి వివరాలను తీసుకుని లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలి పారు. అలాగే సంఘంలో ఇంతవరకూ చేరని విశ్రాంత ఉద్యోగులు వెంటనే చందా చెల్లించి చేరాలని సూచించారు. పలువురు విశ్రాంత ఉద్యోగులను సభ్యులు సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు సాసుబిల్లి హర శ్రీరాములు, సాసుబిల్లి పైడితల్లినాయుడు, సింగారపు రామకృష్ణ, తాడ్డి అప్పలనాయుడు,తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం ఫుల్.. వసతులు నిల్



గజపతినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



ఎండలోనే కార్ల పార్కింగ్

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కనీస వసతులు లేకపో వడంతో రిజిస్ట్రేషన్‌ల కోసం వచ్చే ప్రజలతో పాటు కార్యాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్‌ల ద్వారా ప్రభుత్వానికి ఏడా దికి సుమారు రూ.30 కోట్లకుపైగా ఆదాయం వస్తున్నప్పటికీ ఇక్కడ కనీస సదుపాయాలు లేవు.ఎప్పుడో బ్రిటిష్ కాలంలో నిర్మించిన చిన్న భవనంలోనే కార్యాలయం నడుస్తోంది.కార్యాలయానికి రిజిస్ట్రేషన్‌ల నిమిత్తం రోజూ దత్తిరాజేరు, మెంటాడ, బొండపల్లి, గజపతినగరం మండలాల నుంచి వందల మంది వస్తుంటారు. వారు విశ్రాంతి తీసుకునేందుకు కనీసం షెడ్డు కూడా లేదు. చెట్లనీడనే విశ్రాంతి తీసుకో వాల్సి వస్తోంది. కార్యాలయంలో ఉన్న ఒకే ఒక మరుగుదొడ్డికి ఎప్పుడూ తాళం వేసే ఉంటోంది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మహిళలు, వృద్ధులు అవస్థలు పడాల్సి వస్తోంది.





చెట్ల నీడలో విశ్రాంతి తీసుకుంటున్న క్రయ, విక్రయదారులు

రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలి



రక్తదానం చేస్తున్న మహిళలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని డీపీఆర్ఓ జానకమ్మ అన్నారు. ఆదివారం స్థానిక కణపాక యూత్ హాస్టల్‌లో ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎటువంటి అనారోగ్యం సోకదని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు బి. రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలి



వాహన ఫిట్‌నెస్ రెన్యూవల్ రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటీకరిస్తూ గుర్ల మండలంలోని అచ్యుతాపురంలో వేదాంత సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని వెంటనే ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చల్లా జగన్ డిమాండ్ చేశా రు. వేపాడ మండల కేంద్రంతో పాటు బొద్దాం, సోంపురం గ్రామాల్లో ఆటో డ్రైవర్లతో కలిసి ఆదివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ ఆర్టీఓ అధికారుల ద్వారానే ఫిట్‌నెస్ సెంటర్‌లో సేవలందించాలన్నారు. ప్రైవేట్ సెంటర్ వారు అధిక ఫీజులు వసూలు చేస్తు న్నారని ఆరోపించారు. ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలని కోరుతూ ఈనెల 10న (సోమవారం) కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి ఆటో కార్మికులు అంతా హాజరు కావాలని కోరారు. సీఐటీయూ నాయకులు, ఆటో డ్రైవర్లు పద్మనాభం, రామారావు, శంకర్, వెంకటరావు, అప్పలకొండ, సత్తిబాబు, వెంకటసత్తి పాల్గొన్నారు. – వేపాడ

జీపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



బొండపల్లి మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో జీపీఎల్(గరుడుబిల్లి ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలు ఈనెల 23వరకు కొనసాగనున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని, విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ట్రోఫీని గ్రామపెద్దలు, నాయకులు ఆవిష్కరించారు. – బొండపల్లి

12న ఉపాధి హామీ వేతనదారుల మహా ధర్నా



మహా ధర్నా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అప్పారావు, తదితరులు

కొత్తవలస: ఉపాధి హామీ వేతనదారుల సమస్యల పరిష్కారానికై ఈనెల 12వ తేదిన జిల్లా కేంద్రం విజయనగరంలోని కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గాడి అప్పారావు తెలిపారు.మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంలో ఉపాధి వేతనదారులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేతనదారులకు వందరోజులు పని కల్పిస్తున్నారని, వీటిని రెండు వందల రోజులకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వేసవి అలవెన్స్ ఇవ్వాలని, మేట్లకు అదనపు వేతనం చెల్లించాలని, పనిప్రదేశంలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు చేపట్టనున్న ధర్నాకు ఉపాధి వేతనదారులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాచైతన్య యాత్ర

కొత్తవలస మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. సీపీఎం నాయకులు సబ్బవరం రోడ్డులోని వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం 9నెలల పాలనలో విద్యుత్ చార్జీలు,నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగిపోయాయని, కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని చెప్పారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై త్వరలో అధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నామని తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



శృంగవరపుకోట: రేవళ్లపాలెంలో నిర్వహించిన శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది



దత్తిరాజేరు: గడసాంలో సేవలందిస్తున్న వైద్యులు

శృంగవరపుకోట: రేవళ్లపాలెం గ్రామంలో కాఫ్వీ హాస్పిటల్, పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో స్థానిక పొట్టి శ్రీరాములు గ్రంథాలయ పాలక మండలి నేతృత్వం లో గ్రామంలో ఆదివారం సాధారణ, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరంలో గ్రామానికి చెందిన సుమారు 150 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి అవ సరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 15 మందిని కంటి ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. వీరికి పుష్పగిరి కంటి ఆస్పత్రిలో త్వరలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నామని నిర్వాహకులు చెప్పారు. గ్రంథాలయ పాలక మండలి చైర్మన్ చప్ప గణేష్ నేతృత్వంలో రోగులు, వైద్య సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రంథాలయ పాలక మండలి సభ్యులు సహాయ, సహకారాలు అందించారు.

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు: మండలంలోని గడసాం,సరయ్యవలస గ్రామాల్లో విజయనగరం సాయి సూపర్ స్పెషాలిటీ (శ్రీరామ్మూర్తి) ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం సాధారణ, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. గడసాంలో 192 మందికి, సరయ్యావలసలో 139 మందికి చెవి, గొంతు,ముక్కు,ఎముకులు, పక్షవాతం, నేత్ర పరీక్షలు, స్త్రీలకు గైనిక్ సంబంధిత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు సతీష్‌రెడ్డి, సింధూరి, రాజేష్, శివకుమార్,కిశోర్ తదితరులు సేవలందించారు. వైద్య బృందం,సిబ్బందికి వైఎస్సార్‌సీపీ నాయకులు నేతేటి వెంకటరమణ,సాలాపు పాపారావు భోజనాలు ఏర్పాట్లు చేశారు.

ఇంటింటికీ భగవద్గీత



భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న ధారరాజు, తదితరులు

శంగవరపుకోట: భగవద్గీత పఠనం భారతీయుని కర్తవ్యమని స్థానిక మోక్షవిద్య యోగమందిర్ నిర్వాహకుడు శీల కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన మోక్షవిద్య యోగమందిర్ సభ్యులతో కలిసి ఎస్.కోటలోని పుణ్యగిరి రోడ్డులో ఆదివారం ఇంటింటికీ వెళ్లి భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ధారరాజు మాట్లాడుతూ సంస్థ కార్యకర్తలు, దాతల సహాయ, సహకారాలతో ఇంటింటికి భగవద్గీత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. పుస్తకాలు కావాల్సిన వారు 99893 68781 లేదా 98667 57311 నంబర్లను సంప్రదించాలని సూచించారు. మోక్షవిద్య యోగమందిర్ కోశాధికారి ఎస్.పెదకాపు, సభ్యులు పి.సంతోష్, కె.శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.